

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు , ఆగస్టు 21, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅభివృద్ధిలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి చేరు కున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి గురువారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆహ్వానం పలికారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఎంకి ఎంపీ వేమిరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీని సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు.

## అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ ఆనంద్




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో పలు అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలు నుంచి కలెక్టర్ ఆనంద్, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి శాఖకు లక్ష్యాలను నిర్దేశించి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అలాగే జిల్లాలో ప్రజలకు సరిపడ ఇసుక నిల్వలు సమృద్ధిగా వున్నాయని, రెండు డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుకను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను పారదర్శకంగా సరఫరా చేసేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆనంద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని నివాస ప్రాంతాలను సర్వే చేసి, ఆయా గృహ యజమానులకు పూర్తి హక్కు కల్పించే స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠం భూములు, ప్రభుత్వ భూముల బౌండరీలను షెడ్యూలు ప్రకారం పూర్తి చేయాలని భూ సర్వే రికార్డుల ఎడి నాగశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఈనెల 23వ తేదీ మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్సూన్ హైజినిక్ (వర్షాకాలంలో పాటించాల్సిన ఆరోగ్యకరమైన అలవాట్లు) కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో విద్యుత్, ఇరిగేషన్ ఎస్ఈలు విజయన్, దేశ్‌నాయక్, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, సిపివో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కురుగొండ్లతో సమావేశమైన వేమిరెడ్డి



**కలువాయి, ఆగస్టు 21, ప్రభాతవార్త** వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో గురువారం నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి సమావేశమయ్యారు. కలువాయి మండలంలోని ఓ కళ్యాణ మండపంలో ఇరువురు నేతలు కలిసి పలు అంశాలపై చర్చించారు. టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## నారంపేటలో పేకాటస్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

- 5లక్షలు నగదు స్వాధీనం
- పోలీసుల అదుపులో 11 మంది పేకాటరాయుళ్ళు



**ఆత్మకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలం నారంపేట లోని పంట పొలాల్లో పేకాట స్థావరంపై గురువారం ఆత్మకూరు సిఐ జి.గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి 5,10,350 రూపాయల నగదును, ఒక మోటర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా పేకాట విచ్చలవిడిగా జరుగుతుందని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ నేపథ్యంలో సిఐ గంగాధర్ అత్యంత చాకచక్యంగా వ్యూహం పన్ని మెరుపుదాడి నిర్వహించి పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకోవడం తీవ్ర సంచలనం కలిగించింది. ఈ దాడుల్లో ఆత్మకూరు ఎస్ఐ షేక్ జిలాని, అనంతసాగరం, ఏఎస్‌పేట , సంగం ఎస్ఐలు , స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న 11మందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ గంగాధర్ తెలిపారు.

## పొదలకూరు మండల నేతలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరామర్శ



**పొదలకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త** విరువూరులో ఎద్దల ప్రసాద్ రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వాకబు చేసారు. అనంతరం మహ్మదాపురంలో టీడీపీ కార్యకర్త ఎండీ ఇర్షాద్ ఇటీవల గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. పొదలకూరులో మైనార్టీ సెల్ నేత షేక్ జమీర్ బాషా కోడలు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## త్వరలోనే రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

- ఆర్డీఓ ఎన్ఎస్ అనూష వెల్లడి





**నెల్లూరు అగ్రికల్చర్, ఆగస్టు 21, ప్రభాతవార్త** రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. రూరల్ నియోజకవర్గంలో పాస్ పుస్తకాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేశామని, డివిజన్లోని అన్ని మండలాలకు తమ కార్యాలయం నుంచి పట్టాదారు పాసు పుస్తకాలను పంపించడం జరిగిందని, నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూష వెల్లడించారు. గురువారం ఆమె నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నెల్లూరు పర్యటనలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించే కార్యక్రమం ద్వారా పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తదుపరి అన్ని రెవెన్యూ డివిజన్లలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ నెలాఖరులోపు ఈ కార్యక్రమం జరిగే అవకాశం ఉందని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో నవంబర్ నెల ఆఖరి లోపు రీ సర్వే పూర్తవుతుందని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది అందుకు అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాటు చేసేందుకు అధికారులకు ఇది వరకే దిశా నిర్ధేశం చేశామని వెల్లడించారు. వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాలలో విగ్రహాలు మునిగేలా నీటి సరఫరా చేపట్టాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించామని చెప్పారు. బందోబస్తు విషయంలో పోలీసు శాఖ, పరిశుభ్రత చేపట్టే శానిటేషన్ శాఖ అప్రమత్తంగా ఉండి కృషి చేయాలని సూచించారు.

# అనధికారిక లేఅవుట్లను ఆదిలోనే అరికట్టాలి

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి




**వెంకటాచలం, ఆగస్టు 21, ప్రభాతవార్త :** అనధికారంగా వేసిన లే అవుట్ లను ఆది లోనే గుర్తించి ప్రత్యేక చర్యలు చెప్పటి అధికారులకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్ర మోహన్ రెడ్డి సూచించారు. వెంకట చలం లోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) అవగాహన సమావేశంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నుడా చైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసుల రెడ్డి నుడా వి సి జాయింట్ కలెక్టర్ కార్తీక్ తో కలిసి లే ఔట్ల పై సమీక్ష నిర్వహించారు అనంతరం సోమి రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం లో 1391 ఎకరాల్లో 138 అక్రమ లేఅవుట్లు ఉన్నాయని నుడా అధికారులు తేల్చారన్నారు .ఇవన్నీ గత ప్రభుత్వ హయాంలో వెలిసిన లేఅవుట్లే అని గుర్తించారన్నారు అక్రమ లేఅవుట్ల కారణంగా ఎదురయ్యే నష్టాలను ప్రజలు కూడా తెలుసుకోవాలన్నారు నుడా అనుమతులున్న లేఅవుట్ లో ప్లాట్లు కొనుగోలు చేస్తేనే విలువ ఉంటుందని గుర్తుంచుకోవాలి అనధికారికంగా వేసిన లేఅవుట్లలో ప్రజాపయోగానికి 10 శాతం స్థలం వదలకపోవడం దురదృష్టకరం భవిష్యత్తులో పిల్లలు ఆడుకునేందుకు కూడా స్థలాలు లేకుండా చేయడం సరికాదున్నారు.

### అక్రమ లేఅవుట్ల పాపం వైసీపీదే

**నుడా చైర్మన్ కోటంరెడ్డి**

వైసీపీ ప్రభుత్వంలో వందలాది అక్రమ లేఅవుట్లు వెలిశాయి లేఅవుట్లలో కలిపేసుకున్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకుంటాం అక్రమ లేఅవుట్లు కళ్ల ముందు కనిపిస్తున్నా 76710 46615 76 పనిచేసే పంచాయతీ 67 కార్యదర్శులు పట్టించుకోకపోవడం బాధాకరం.

### లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి

**నుడా వీసీ, జాయింట్ కలెక్టర్ కార్తీక్**

ఎల్ఆర్ఎస్ ను ప్రజల్లోకి యుద్ధప్రాతిపదికన తీసుకెళ్లాలి ఈ అద్భుత అవకాశంతో వచ్చే ప్రయో జనాలను వారికి వివరించాలి..అదే సమయంలో అక్రమ లేఅవుట్లతో ఎదురయ్యే ఇబ్బందులపై చైతన్యపరచాలి ఎంపీడీఓలు, తహసీల్దార్లు సమన్వ యంతో పనిచేసి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచే యాలి ఎల్ఆర్ఎస్ ను విజయవంతం చేయడం అందరి బాధ్యత



# అక్రమ కేసుల పై ఎస్పీ కార్యాలయానికి వైసీపీ నేతలు



**నెల్లూరు క్రైం, ఆగస్టు 21, ప్రభాతవార్త :** జిల్లాలో వైసిపి నాయకులు పై వరుసగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపిస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయి వైసిపి నేతల బృందం గురువారం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలనను పూర్తిగా గాలికొదిలేసిందని, వైఎస్ఆర్సిపి నేతలే టార్గెట్‌గా, అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతోందని మండిపడ్డారు. ఇటీవల నెల్లూరు పర్యటనకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేసిన సమయంలో తమ నేతలను ఇబ్బంది పెట్టేలా కూటమి ప్రభుత్వం చేసిన కుట్రలు అందరికి తెలిసినవేనన్నారు. ఇలాంటి దుష్ట సంస్కృతిని రాష్ట్రంలో ఎన్నడూ చూడలేదన్నారు. ఈ విషయంపై ఈరోజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీని కలిసి మెమొరాండం ఇద్దామని వస్తే ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఎస్పి డిఎస్పీకి మెమోరాండం అందజేశామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నేతలపై కక్షపూరితంగా కేసులు నమోదు చేయిస్తుందని ఈ పద్ధతి సరికాదని.. ఇలాంటి వాటిని పోలీసు డిపార్ట్మెంట్ వారు కూడా ప్రోత్సహించవద్దని, కేసులు పెట్టే పద్ధతి మానుకోవాలని తెలిపామన్నారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదేశాలతో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ఇష్టానుసారంగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఘటనలు జరిగిన సమయంలో వారు అక్కడున్నారా లేదా, అనే కనీస అవగాహన కూడా లేకుండా ఏ సెక్షన్లు చెబితే ఆ సెక్షన్లు పెట్టి దుర్మార్గంగా కేసులు నమోదు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి పోలీస్ డిపార్ట్మెంట్ కు పూర్తిగా సహకరిస్తూ వస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటన రోజు పోలీసులే వైఎస్ఆర్సిపి నేతలపై లాఠీచార్జ్ చేసి వారిని కిందపడేసి తిరిగి వైస్సార్సీపీ నేతల పైనే అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటు అన్నారు. ఇటీవల కావలి మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ సీపీ నేత రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై కూడా హత్యాయత్నం కేసు నమోదు చేశారని అన్నారు. కావలిలో ఒకచోట అక్రమ మైనింగ్ జరుగుతుందన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని ఉద్దేశంతో అక్కడ నిఘా ఉంచి ఫోటోలు తీయడానికి మనుషులను పంపితే రెక్కి నిర్వహించారని అభియోగం మోపడం దుర్మార్గమన్నారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ ఇలా ప్రతి ఒక్కరి పై అక్రమ కేసులు నమోదు చేయాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. వైఎస్ఆర్సిపి నేతలను అనవసరంగా టార్గెట్ చేసి కేసులు పెడుతున్న తెలుగుదేశం పార్టీని చూసి ప్రజలు కూడా భయపడుతున్నారని అన్నారు. అక్రమ కేసులు విషయంలో మార్పు రాకుంటే, రాబోయే రోజుల్లో దీన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో ఆలోచన చేసి పటిష్టమైన కార్యచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ నేతలు ఆనం విజయ్ కుమార్ రెడ్డి, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీకి సేవలు అందిస్తు రైతులకు అందుబాటులో ఉండండి : ఎమ్మెల్యే



**కలువాయి ఆగస్టు 21 ప్రభాతవార్త** కలువాయి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సేవలను రైతులకు అందిస్తు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని నూతనంగా ఎంపికైన పాలక వర్గ సభ్యులను ఉద్దేశించి వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణా అన్నారు. వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో గురవారం నూతనంగా ఎంపికైన సొసైటీ అద్యక్షులు గాడిపర్తి జగదల్ నాయుడు , డైరక్టర్లు నాళే పెంచలయ్య , గ్రంధి సురేష్‌బాబు , ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్దానిక ఉమామహేశ్వరీ కళ్యాణ మండపం నందు నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతు కూటమి ప్రభుత్వంలో నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రైతులకు అనేక విధాలుగా లాభం చేకూరే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన ప్రశంసించారు. ఈక్రమంలో రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకొని సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎన్‌డిసిసిబి చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, బిసి ఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య, సోమశిల ప్రాజక్టు చైర్మన్ ఏలూరు కేశవ చౌదరి, వెంకటగిరి నియోజకర్గం జనసేన నాయకులు తోట కృష్ణయ్య, వెంకటగిరి బిజెపి ఇంచార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, స్దానిక నాయకులు, వెంకటేశ్వర్లునాయుడు, రఘురామిరెడ్డి, కిషోర్‌రెడ్డి, పీర్ల సోమయ్య, బుజ్జిరెడ్డి, రైతులు అభిమానులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



**లింగసముద్రం, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని సబ్ కలెక్టర్ హిమావంశి చెప్పారు. గురువారం ఆయన కందుకూరు సబ్ కలెక్టర్ గా బాధితులు చేపట్టిన తర్వాత తొలిసారి లింగసముద్రం వచ్చారు. సందర్భంగా మండలంలోని యర్రారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఎర్రరెడ్డి పాలెంలో గ్రేజింగ్ పోరంబోకు భూముల సమస్యను, గంగపాలెం లో ఉన్న భూ సమస్యను పరిశీలించారు. అనంతరం ఆయన తహసిల్దార్ కార్యాలయాన్ని, ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డేని తప్పనిసరిగా నిర్వహించాలని వివిధ సమస్యల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పనిచేయాలన్నారు. ప్రజలు తమ సమస్యను తెలిపేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా రావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎన్. కోటేశ్వరరావు, ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## అధ్యాపకులను ఏర్పాటు చేయాలంటు ఎమ్మెల్యేకి వినతి



**కలువాయి ఆగస్టు 21 ప్రభాతవార్త** మండల కేంద్రమైన కలువాయిలో బివిఎన్ఆర్ జడ్పి హైస్కూల్ ప్లస్ నందు ఇంగ్లీషు ,ఫిజిక్స్, బోటనీ కి సంబందించి అద్యాపకులను నియమించాలంటు విద్యార్దినులు కలువాయికి వచ్చిన వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణకు పాఠశాల కమీటి చైర్మన్ మహేష్‌తో కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. కళాశాల నందు 140 మంది విద్యార్దినులు ఉన్నారు. మూడు నెలల క్రితం జరిగిన కౌన్సిలింగ్‌లో ఆయా సంబందించిన సబ్జెక్టులకు అద్యాపకులు బదలీ అయ్యారు. ఇప్పటి వరకు ఖాళీ అయిన సబ్‌జక్టులకు అద్యాపకులను నియమించ లేదని వారి బాధలను ఆయనకు తెలియజేశారు. ప్రస్తుతం రెండు యూనిట్లు పరీక్షలు కూడా పూర్తి అయ్యాయని ఇప్పటి వరకు అద్యాపకులను నియమించకపోవడంపై వారు ఆందోళన చెందుతు శాసనసభ్యులకు వివరించారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారులు



**ఉలవపాడు, ఆగస్టు 21, ప్రభాతవార్త** ఉలవపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఒంగోలు, నెల్లూరుకు చెందిన డీసీహెచ్ఎస్ అధికారులు శ్రీనివాస్ నాయక్, పరిమిళలు గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మత్తు డాక్టర్ డెంటల్ చిన్న పిల్లల వైద్యులు విధుల్లో ఉండగా మొత్తం మీద ఐదుగురు వైద్యులు వివిధ కారణాలతో సెలవుల్లో ఉన్నారు. ఇదే విషయమై స్థానికులు ఆసుపత్రికి తనిఖీలకు విచ్చేసిన అధికారుల దృష్టికి కొన్ని సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా ఉండాల్సిన గైనకాలజిస్టు జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ మరో జనరల్ వైద్యులు ఇద్దరు వివిధ కారణాలపై దీర్ఘకాలిక సెలవులు పెట్టారు. దీంతో మండలంలో నుంచి అత్యవసర పరిస్థితుల్లో గర్భవతులు, ప్రమాదాల సమయంలో గాయపడిన వ్యక్తులకు చిన్న చిన్న ఆపరేషన్లు అవసరం అయితే చేయాల్సిన జనరల్ సర్జన్ కూడా లేకపోవడం జనరల్ మెడిసిన్ వైద్యులు సెలవుల్లో ఉండడం అత్యవసర కేసులను కావలి కందుకూరు ఏరియా హాస్పిటల్‌కి పంపించేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా రాత్రులు డ్యూటీ డాక్టర్లు కూడా అందుబాటులో లేకపోవడంతో అత్యవసర కేసులను బయట ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు పూర్తి స్థాయిలో వైద్యుల్ని నియమిస్తామని ఎప్పటిలాగే పూర్తి స్థాయి వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైద్యులు పనితీరు మార్చుకోకుండా ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవని, ఈ సందర్భంగా వారువైద్య సిబ్బందిని హెచ్చరించారు. ఆసుపత్రికి ఎదురుగా శిధిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించక పోవడంతో పాములు, తేళ్లు బయటకి వస్తున్నాయని ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రాణాపాయంగా పరిస్థితి ఏర్పడిందని అధికారులు దృష్టికి తీసుకెళ్లడంతో త్వరలోనే పాత ఆసుపత్రి భవనాన్ని తొలగిస్తామని చెప్పారు.

## మర్రిపాడులో ప్రత్యేక గ్రీవెన్స్‌డే



**మర్రిపాడు , ఆగస్టు21,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మర్రిపాడులో గురువారం ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని ప్రత్యేక రెవెన్యూ గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. మండలంలో రెవెన్యూపరమైన సమస్యలు ఎక్కువగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశాల మేరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ ప్రత్యేక రెవెన్యూ విజ్ఞప్తుల కార్యక్రమానికి మండలంలోని బాధితులు 96 అర్జీలను అందజేశారు. రోషన్ నెంబర్‌లను రెగ్యులర్ ఖాతాలుగా చేయాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలను మంజూరు చేయాలని, వెబ్‌లాండ్ అడంగల్‌లో పేర్లు నమోదు చేయాలని పలు సమస్యలతో ఈ అర్జీలను అందజేశారు. ఈసందర్భంగా ఆర్‌డిఒ బి.పావని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మర్రిపాడు మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక రెవెన్యూ ప్రజా విజ్ఞప్తుల దినాన్ని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా 96అర్జీలు వచ్చాయని వాటిని నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆమె రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జ్ తహసిల్దార్ సి.హెచ్.అనిల్‌కుమార్ యాదవ్, కార్యాలయ సిబ్బంది , మండల టిడిపి కన్వీనర్ దేవరాల గంగాధర్‌యాదవ్, భీమవరం సొసైటీ అధ్యక్షులు యర్రమల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు పోలీస్ అనుమతులు తప్పనిసరి ఎస్ఐ శివరాకేష్



**మనుబోలు ఆగస్టు 21 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలో వినాయక ఉత్సవాలకు సంబందించి ఎస్ఐ శివరాకేష్ గురువారం నాడు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క ఉత్సవ కమీటి అనుమతుల కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని అన్నారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్న తరువాత సంబందిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనీఖి చేసి నిబందనల ప్రకారం ఉండే క్యూ ఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఒసి) జారీ చేస్తారని బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు మాత్రమే అనుమతులు తప్పనిసరి అని ఈ ఆన్‌లైన వ్యవస్థ ఉత్సవాలను సురక్షితంగా పారదర్శకంగా నిర్వహించడానికి ఉద్దేశించడింది అని తెలిపారు.

## సొంత డబ్బులతో గ్రావెల్ తోలించిన మాలేపాటి.. గ్రామస్తుల కృతజ్ఞతలు



**దగదర్తి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** దగదర్తి మండలం దుండిగం పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీల కాలనీలకు పోవు దారి అధ్వాన్నంగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి భానుంచదర్ గురువారం వారి సొంత నిధులు రూ.25వేలు వ్యయంతో ఆ రోడ్డుకి గ్రావెల్ తోలించారు. పైపులు తెప్పించి ఇరువైపులా డ్రైనేజీ సిస్టంను ఆధునీకరించి అక్కడి వారికి సౌకర్యాలను కల్పించారు. ఉసురుపాటి రఘురామయ్య ఇంటి వద్ద నుండి తలారి రమేష్ ఇంటి వరకు గ్రావెల్ తో రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోనంకి శివయ్య, ఉసురుపాటి రాంబాబు, ఉసురుపాటి సురేష్, మంద రాఘవేంద్ర, పందల పెంచలమ్మ, ఉసురుపాటి ఆదర్శ, తదితరులు పాల్గొన్నారు. ఈ మరమ్మతులు నిర్వహించినందుకు గాను కాలనీ వాసులంతా మాలేపాటి భానుచందర్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## హత్య రాజకీయాలు చేస్తున్న రామిరెడ్డిని అరెస్టు చేయాలి



**దగదర్తి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** కావలిలో హత్య రాజకీయాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని దగదర్తి మండలం టీడీపీ ఇన్‌ఛార్జీ పమిడి రవికుమార్ చౌదరి అన్నారు. రెండు రోజుల క్రితం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నవరం క్వారీలో మాజీ ఎమ్మెల్యే కొంతమందిని రౌడీలను తీసుకువచ్చి తన అనుచరులతో డ్రోన్ కెమెరా ద్వారా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆచూకీ తెలుసుకుని హత్య చేయించాలనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. దానికి నిరసనగా దగదర్తి కెనరా బ్యాంకు దగ్గర నుంచి ఎల్లిపోడు రోడ్డు వరకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి దిష్టిబొమ్మతో భారీ శవయాత్ర చేసి దహనం చేశారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ హత్యా ప్రయత్నం చేసిన ప్రధాన సూత్రదారైన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృత్యంతర బోధనపై దృష్టి సారించాలి



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని ఈస్ట్ దళితవాడలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఉపాధ్యాయులు కృత్యంతర బోధనపై దృష్టి సారించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం పారదర్శకంగా అమలు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు విషయాలు మాట్లాడి వారిని అభినందించారు.

## గ్రామాల్లోని సమస్యల పరిష్కరించేందుకు కృషి

**కావలి,ఆగస్ట్ 21, ప్రభాతవార్త:** గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని కావలి మండల పరిషత్ అధ్యక్షురాలు ఆలూరి కొండమ్మ తెలియజేశారు కావలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశం మందిరం నందు గురువారం ఎంపీపీ ఆలూరి కొండమ్మ అధ్యక్షతన మండల స్థాయి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశము నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చేవూరు శ్రీదేవి పలు శాఖల అధికారులకు గ్రామలలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించడం జరిగింది గ్రామాల సమస్యల పరిష్కారానికి వేదికగా సర్వసభ్య సమావేశము నిర్వహించడం జరుగుతుందని ఈ వేదిక ద్వారా గ్రామాల్లోని సమస్యలను చర్చించుకుని పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు, ఈ సమావేశము నందు గ్రామాల్లోని పలు సమస్యలను చర్చించడం జరిగింది ఎంపిటీసీలు సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి వెళ్లడం జరిగింది సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ఎంపిటీసీలు,సర్పంచులు పాల్గొన్నారు

## కుక్కలదాడి నుండి చుక్కల దుప్పిని కాపాడిన అటవీ అధికారి



**ఉదయగిరి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఆర్టీసీ డిపోలో కుక్కల గురువారం తరుముకొని రావడంతో కుక్కల దాడి నుండి చుక్కల దుప్పిని ఉదయగిరి అటవీ అసిస్టెంట్ బీట్ అధికారి వెంకటేశ్వర్లు కాపాడారు. గురువారం చుక్కల దుప్పి నీరు తాగేందుకు ఉదయగిరి ఆర్టీసీ డిపో సమీపంలోకి రాగానే కుక్కలు తరుముకున్నాయి. ఈ క్రమంలో భయబ్రాంతులకు గురైన ఆ చుక్కల దుప్పి ఆర్టీసీ గ్యారేజ్‌లోకి వెళ్లింది. సమాచారం అందుకున్న అటవీశాఖ కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పిని ప్రథమ చికిత్స అనంతరం సురక్షితంగా అడవిలోకి వదిలేశారు.

## వృద్ధులుకు చట్టాల పట్ల అవగాహన



**కావలి,21 ఆగస్టు ప్రభాతవార్త:** కావలి పట్టణం11వ వార్డు పరిధిలో ని ఎస్సీ కాలనీ ప్రజలకు, వయోవృద్ధులకు వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా కావలి మండల న్యాయాధికారిక సంస్థ చైర్మన్ ఎ. గీతా వాణి ఆదేశాల మేరకు కావలి మండల లీగల్ ఎయిడ్ మెంబెర్, న్యాయవాది ఐ.సాయి ప్రసాద్ గురువారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించి మాట్లాడారు వృద్ధుకు ఉన్నటువంటి చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు పెద్దల పట్ల గౌరవంగా వుండాలి అని వారిని కించపరచడంకానీ చులకన చేయడం కానీ చేయరాదని తెలియజేశారు,కాలనీలో వున్న పిల్లలు అందరిని పాఠశాలకు పంపించాలి అని, సమాజం లో గౌరవం గా జీవించాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో న్యాయవాది జి. నరేష్,11వ వార్డు వెల్ఫేర్ సెక్రటరి కె. వెంకటేశ్వర్లు స్తానిక కాలనీ వృద్ధులు, ప్రజలు పాల్గొన్నారు.

## రక్తదానం చేసేందుకు యువత ముందుకు రండి



**నెల్లూరు, ఆగష్టు 21, ప్రభాతవార్త-వైద్యం :** రక్తం కొరత సమస్య ఏర్పడినప్పుడు, అత్యవసరంగా రక్తం అవసరమైన సమయాలలో యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన తన పుట్టిన రోజు సందర్భంగా అత్యవసర పేషంట్ కొరకు 114 వ సారి నెల్లూరు రెడ్ క్రాస్ సెంటర్లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నిధి కేంద్రంలో నిల్వలు పెంచడం కోసం, అత్యవసర సమయాలలో నిరుపేదలకు రక్తం అవసరమైనప్పుడు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మోటివేటర్, మొర్గు కన్వీనర్ అరిగలా సాయిరాం, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగనవాడి వర్కర్లకు ఒకే యాప్ విధానాన్ని తీసుకురావాలి




**కావలి,ఆగస్ట్ 21, ప్రభాతవార్త:** అంగన్వాడీ వర్కర్లకు ఇప్పటివరకు ఉన్న యాఫ్ లు రద్దుచేసి ఒకే యాప్ విధానాన్ని తీసుకురావాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఏపీ అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర పిలుపుమేరకు గురువారం కావలి పట్టణం ఉదయగిరి రోడ్డు సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో అంగనవాడి వర్కర్లు అండ్ హెల్పర్లు మానవహారాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, 5జి కలిగిన కొత్త ఫోన్లు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, సెంటర్లకు నాణ్యత కలిగిన సరుకులు ఇవ్వాలని, ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులు అనేపదం తొలగించి సంక్షేమ పథకాలు కొనసాగించాల అన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేతనాలు పెరుగుతాయని పని భారం తగ్గుతుందని సమస్యలు పరిష్కారం అవుతాయని ఓట్లేసి గెలిపించారని అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా రకరకాల యాప్ ల పేరుతో పని భారాన్ని పెంచుతూ వేతనాలు పెంచకుండా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం చూస్తూ ఉందని తెలియజేశారు ఇది ఏ మేరకు న్యాయం అని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగనవాడి వర్కర్ల సమస్యలు అన్నిటిని పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రస్తుత సమస్యలు పరిష్కరించుకుంటే దశల వారి పోరాటాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై.క్రిష్ణ మోహన్, యూనియన్ అధ్యక్షులు రుక్మిణి కార్యదర్శి కే. శుభాషిని నాయకులు జయంతి, ప్రభావతి, విజయలత, రఘురావమ్మ, కళావతి, జ్యోతి, బిందు తో అంగనవాడి వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

## ఆక్వా కల్చర్ రైతుల ఆర్థిక, బీమా సమస్యలపై బీద మస్తాన్ డిమాండ్



**కావలి, 21 ఆగస్టు ప్రభాతవార్త:** రాజ్యసభలో జీరో అవర్ నోటీసు ద్వారా ఆక్వా కల్చర్ రంగం, ముఖ్యంగా రొయ్యల సాగు రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక, బీమా సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని తెలుగు దేశం పార్టీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ గురువారం డిమాండ్ చేసి మాట్లాడారు ప్రస్తుతం దేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో రొయ్యల వాటా 66 శాతం, రూ.40,013 కోట్లు (యుఎస్ (డాలర్స్) 4.88 బిలియన్, 2023-24) ఆదాయాన్ని అందిస్తున్నప్పటికీ, రైతులు అప్పులపాలై ఆర్థికంగా కష్టాల్లో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మూడున్నర లక్షలకు పైగా చిన్న రైతుల జీవనాధారం ఈ రంగమేనని గుర్తుచేశారు.ఆక్వారంగ రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను బీద మస్తాన్ రావు యాదవ్ రాజ్యసభలో లేవనెత్తుతూ బ్యాంకు రుణాల లభ్యతలో లోపం ఉదాహరణకు కిసాన్ క్రెడిట్ కార్డు (కే సి సి ) అర్హత లేక, నెల్లూరు జిల్లాలోనే 60 శాతం రైతులు ప్రైవేట్ అప్పులపై 36 శాతం వడ్డీ చెల్లిస్తున్నారన్నారు.దేశవ్యాప్తంగా 10 శాతం కంటే తక్కువ రైతులకే బీమా ఉంది. తుఫానులు, వరదలు వచ్చినా పరిహారం అందటం లేదన్నారు.వైట్ స్పాట్ సిండ్రోమ్ వంటి వ్యాధుల వల్ల ఏటా వేల కోట్ల నష్టం జరుగుతున్నా, వ్యవసాయంలో ఉన్నట్లుగా పీ ఎం ఎఫ్ బి వై తరహా పథకం ఆక్వా రంగంలో లేదన్నారు.ఇతర దేశాల పోటీతో ధరలు కిలోకు రూ.180-200 వరకు పడిపోయాయని తెలిపారు. పై సమస్యల పరిష్కారానికి శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్ డిమాండ్ చేస్తూ లీజ్ భూముల రైతులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డు అర్హత కల్పించాలినీ ప్రీమియం సబ్సిడీతో సులభమైన బీమా పథకాలు అమలు చేయాలినీ ఆక్వా పీ ఎం ఎఫ్ బి వై తరహా బీమా పథకం ప్రవేశపెట్టాలన్నారు ఎగుమతి ప్రోత్సాహకాలు, కోల్డ్ చైన్, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు రొయ్యల సాగు వార్షికంగా రూ.40,000 కోట్ల ఆదాయాన్ని తెస్తున్నందున రైతులను అప్పుల బారినుంచి రక్షించి, ఈ రంగం అభివృద్ధికి ప్రభుత్వం జాతీయ ప్రాధాన్యతనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి కూలీలు రెండు పూటల హాజరు తప్పనిసరి



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే శ్రామికులు తప్పనిసరిగా రెండు పూటలా హాజరు వేయాలని డ్వామా ఏపీడీ మృదుల అన్నారు. కోవూరులోని డ్వామా కార్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చేపట్టే పనిని ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో పనిచేయక ముందు, పనిచేసిన తర్వాత ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. అదేవిధంగా ఈ పథకం కింద పనిచేసే కూలీల శాతాన్ని ఘననీయంగా పెంచేలా ఉపాధి హామీ పథకం సిబ్బంది తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పథకం కింద చేపట్టే పనులు పారదర్శకంగా నిర్దేశించిన ప్రమాణాలతో చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీ సాధిక్, తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**గోనువల్లి (రాపూరు), ఆగష్టు 21, ప్రభాతవార్త :** మండలంలోని గోనుపల్లి గ్రామంలోని ఆరుంధతీయవాడలో మృతి చెందిన పామర్తి వెంకటసుబ్బయ్య కుటుంబానికి గురువారం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు ఈగా రాజా రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుని నివాసానికి చెరుకున్న రాజారెడ్డి వెంకటసుబ్బయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులరల్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు రూ. 5 వేల నగదు సాయం ఆందజేశారు.

## వినాయక చవితి ఉత్సవాలు సామరస్యంగా జరుపుకోవాలి



**కావలి, 21 ఆగస్టు ప్రభాత వార్త:** కావలి రూరల్ మండలంలోనీ ప్రజలు గణేష్ ఉత్సవాలను శాంతి భద్రతలతో,సామరస్యంతో జరుపుకోవాలని కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి రాజేశ్వరరావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిగణేష్ విగ్రహప్రతిష్టాపన, ఉత్సవాల సమయంలో అనుసరిం చవలసిన ముఖ్యమైన మార్గదర్శకాలను గురువారం తెలియజేశారు వినాయకచవితి, ఉత్సవాలు పోలీస్ ,మున్సిపల్ ,విద్యుత్ శాఖల అధికారుల అనుమతితో నిర్వహించాలన్నారు అనుమతి తప్పనిసరి: ఏవైనా గణేష్ మండపాన్ని బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలంటే పోలీస్ నుండి అనుమతి తప్పనిసరి. ఆన్లైన్లో అప్లై చేసుకోవాలన్నారు మండపం స్థాపన రహదారి పైన, ట్రాఫిక్కు ఆటంకం కలిగించేలా ఉండరాదు, ఒక వైపు మాత్రమే ఏర్పాటు చేయాలన్నారుగణేష్ విగ్రహాలను పర్యావరణ హితం దృష్టిలో ఉంచుకొని మాత్రమే పెట్టాలనీ పాప్ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్), రసాయన రంగులు వాడటం మానుకోవాలి. గట్టి మట్టి విగ్రహాలు మాత్రమే వినియోగించాలన్నారు మైక్ మరియు స్పీకర్లు ఉపయోగించడానికి ముందు సంబంధిత పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు ఉత్సవ ప్రాంగణంలో,ఉత్సవ కమిటీవారు మహిళలకు, చిన్నపిల్లలకు, వృద్ధులకు,ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలన్నారు ఉత్సవ కమిటీవారు మండపం నందు త్రాగునీరు,అత్యవసర వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు ఉత్సవ కమిటీవారు మండపంలో విధ్యుత్ అలంకరణను జాగ్రతగా ఏర్పాటు చేసుకొన వలెనన్నారు ప్రతి రోజు రాత్రి 10:00 గంటల నుండి ఉదయం 6:00 గంటల వరకు లౌడ్స్పీకర్లు వినియోగించరాదన్నారు అశాంతి కలిగించే నినాదాలు,పాటలు మరియు మద్యం సేవిం చడం వంటి అనుమతి లేని కార్యక్రమాలకు పాల్పడరాదనీ సి సి టి వి మరియు సురక్షిత ఏర్పాట్లు సి సి టి వి లు 24న7 రికార్డింగ్ ఉండాలి. మండపాలు,ఉత్సవ ప్రాంతాల్లో ఫైర్ సేఫ్టీ (నీరూ, ఇసుక) ఉండాలి. మంటలు పట్టే పదార్థాలు దాచరాదన్నారు ప్రతి మండపంలో కనీసం ముగ్గురు వాలం టీర్లుఉం డాలి, వారి కాంటాక్ట్ డిటైల్స్ స్థానిక పోలీసులకు ఇవ్వాలన్నారు అత్యవసర సమయంలో 112 కు కాల్ చేయాలనీ విగ్రహ నిమర్జన: అధికారులు సూచించిన ప్రత్యేక ప్రదేశాల్లో మాత్రమే నిమర్జన. ఊరేగి ంపులు నిర్ణిత మార్గాల్లో, నిదానంగా సాగాలి పటాకులు నిషేధం మరియు నిమజ్జనానికి ప్రత్యేక బృందాలను ఏర్పా టుచేయాలన్నారు ఉతవ కమిటీవారు నిబంధనలు ఉల్లంఘించినపుడు అధికారులు తగిన చర్యలు తీసుకుం టారన్నారు ఈ మార్గదర్శకాలను పాటించడం ద్వారా గణేష్ పండుగను సురక్షితంగా, పర్యావరణ హితంగా, శాంతి యుతంగా జరుపుకుందాం అని తెలియజేశారు

## డిల్లి సిఎంమీద జరిగినదాడి ప్రజాస్వామ్య విలువలపై జరిగినట్లే బిజెపి జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాద్‌రెడ్డి

**జలదంకి,ఆగష్టు21,ప్రభాతవార్త:** డిల్లి ముఖ్యమంత్రిపై బుధవారం జరిగినదాడి ప్రజాస్వామ్య విలువలపై జరిగినట్లేనని భారతీయ జనతాపార్టి జిల్లాకార్యదర్శి వడ్డే శ్రీనాద్‌రెడ్డి అభివర్ణించారు.గురువారం జలదంకిలో ఆయన ఈదాడిని ఒక ప్రకటనలో తీవ్రంగ ఖండించారు.సిఎంగ పదవీభాద్యతలు తీసుకున్న అనంతరం రేఖాగుప్త ప్రజాదరదణ కార్యక్రమాలతో ప్రజాహృదయాలను గెలుచుకుంటుందనిఅన్నారు.తద్వార డిల్లి నగరంలో ప్రతి పౌరుడు ఎటువంటి జంకుబెంకు లేకుండ నేరుగ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికితీ సుకుపోతు అవకావాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని వివరింఆచరు.ఈక్రమంలో ముఖ్యమంత్రి పైదాడి ప్రజాస్వామ్య ప్రక్రియకు భంగంకలిగించడంతోపాటు మచ్చతెచ్చినట్లైందని వడ్డే పెదవివిరిచారు.కావున దాడివెనుక వున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తద్వార ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తిచేశారు.

## ముప్పాళ్ళ పిఎసిఎస్ చైర్మన్ రమణయ్యకు శుభాకాంక్షలు తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే



**కందుకూరు,ఆగస్టు 21, ప్రభాతవార్త:** పొన్నలూరు మండలం, మంగపటేరివారిపాలెం గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నెం రమణయ్యకు ముప్పాళ్ళ పిఎసిఎస్ చైర్మన్గా నియమితులయ్యారు. గురువారం ముప్పాళ్ళ సొసైటీ కార్యాలయం నందు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరై శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించిన అనంతరం శుభాకాంక్షలు తెలియజేసిన నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , బిజెపి ఎస్సీ మోర్చా ప్రకాశం జిల్లా అధ్యక్షులు పెరికె లక్ష్మణ్ , పొన్నలూరు మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు పెరికె గోపి , ఎండ్లూరి మల్లిఖార్జున , నల్లెపోగు సైమన్ తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలను అడ్డుకోవడం ఎంతైనా అవసరం



**కావలి,ఆగస్ట్ 21, ప్రభాతవార్త:** బాల్య వివాహాలను అడ్డుకోవడం ఎంతైనా అవసరం ఉందని కావలి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ తెలియజేశారు ఆర్డిఓ కార్యాలయంలో గురువారం ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది తొలుత ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం జరిగింది బాల్య వివా హాల చట్టాలపై అవగాహన కలిగించే బ్రోచర్లను ఆవిష్కరించడం జరిగింది అనంతరం ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణ మాట్లాడారు ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చర్యలు తప్పవని తెలియజేశారు ఈ విషయంలో సంబంధిత అధికారులు కూడా బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు కావలి డిఎస్పి పి శ్రీధర్ మాట్లాడారు బాల్యవివాహాలను అడ్డుకునే విషయంలో తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడారు అందరం కలిసికట్టుగా బాల్య వివాహాలను అడ్డుకుందామని సూచించారు ఐసిడిఎస్ పిడి హేనా సృజన మాట్లాడారు బాల్య వివాహాలను అడ్డుకునేందుకు అందరూ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## మహిళా రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని రైతు ఉత్పత్తి మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మహిళా రైతు గ్రూపులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూతన పంటలపై ఎఫ్‌పీవోలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మునగ సాగుకు ఎఫ్‌పీవోలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ పంటలకు అవసరమైన టార్పాలిన్స్, స్ప్రేయర్లను కూడా ప్రభుత్వం సబ్సిడీతో అందజేయడం జరుగుతుందన్నారు. ఒక్కో ఎఫ్‌పీవో గ్రూపుకు రివాల్వింగ్ ఫండ్ రూపేనా 10 వేలు చొప్పున వారివారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీసీలు రాజశేఖర్, రాము పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో అధ్యక్షురాలు జి శైలజ, కార్యదర్శి ఎస్‌కే రఫియా, కోశాధికారి ఆర్. సునీతమ్మ, మహిళా రైతులు ఉన్నారు.

## సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవాలి



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వి. సురేష్‌బాబు తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కళాశాల సైన్స్ అండ్ హుమానిటీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మానవుని మెదడులో కుడివైపు ఉద్వేగాలు, మానవ సహజమైన భావాలు, సున్నితమైన ప్రతి స్పందనలు ఉంటాయన్నారు. మెదడు యొక్క ఎడమ వైపు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, హేతుబద్ధమైన ఆలోచనలు , ఊహా శక్తి ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తమ మేథా శక్తికి మరింత పదును పెట్టుకోవాలని సూచించారు. అనవసరమైన భయాలను సందేహాలను వదిలి దృడమైన ఆత్మ విశ్వాసంతో జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కళాశాల ఎస్అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ పీఎం కిషోర్ మాట్లాడుతూ ఇటువంటి మోటివేషన్ కార్యక్రమాల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక శక్తులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మోటివేటర్ డాక్టర్ సురేష్‌బాబును శాలువాతో సత్కరించారు.

## వినాయక చవితి వేడుకలకు ఉదయగిరి ఎస్సై సూచనలు



**ఉదయగిరి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గ్రామాలలో జరిగే వినాయక చవితి ఈనెల 27వ తేదీ జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని గ్రామాలలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. నిమజ్జన వివరాలు ప్రదేశం నిర్వాహకులు వివరాలు ముందుగా స్టేషన్లో ఇవ్వాలని అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా డీజేలు పాటకచ్చేరీలు, అశ్లీల నృత్యాలు అనుమతులు లేవని స్పష్టం చేశారు. అలాంటివి నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీల నిరసన



**ఆత్మకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** పట్టణంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్ట్ కార్యదర్శి పి.రాధ, సిఐటియు మండల ఉపాధ్యక్షులు కె.దేవిడ రాజు ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు అంగన్‌వాడీ కార్యకర్తలకు , హెల్పర్లకు కనీసవేతనం ఇవ్వాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని 5జిబి ట్యాబ్‌లను ఇవ్వాలని నినాదాలు చేశారు. తాము తమ ఫోన్‌లలో లబ్ధిదారుల నమోదు, పేస్ యాప్‌లు సక్రమంగా పనిచేయక ఇటీవల తమ ఫోన్‌లను సిడిపిఒ కార్యాలయాల్లో ఇచ్చేయడం జరిగిందని , దాని గురించి ప్రభుత్వం ఏమి స్పందించలేదని తాము ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీసవేతనం పెంచి మంచి ఫోన్ ఇచ్చేంతవరకు తాము నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు ఆర్.సుప్రజ, ఎస్.విజయమ్మ, ఎస్.కె.హమీద, వాణిశ్రీ, లక్ష్మీనారాయణమ్మ, సుజాత, పద్మ, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



**ముత్తుకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి బెయిల్ పై బుధవారం విడుదల కావడంతో బ్రహ్మదేవంలో వైసిపి శ్రేణులు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి గండవరం సుగుణ మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసు బనాయించి జైలు పంపిందని, రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆమె అన్నారు. అనంతరం బ్రహ్మదేవం యువనాయకుడు మస్తాన్ (అగ్గి) మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని విడిచి పెట్టకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని ఆయన పై తప్పుడు కేసు బనాయించడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఆయన జైలుకు వెళ్లినా కాకాణి కుమార్తె పూజితమ్మ ప్రజల్లో ఆయనకు ఉన్న ఆధరణతో నియోజకవర్గంలో పర్యటించి అందరికి ధైర్యం చెప్పిందని అన్నారు. కడిగిన ఆణిముత్యంలా కాకాణి గోవర్ధన్ రెడ్డి బయలకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గండవరం సుగుణ, కోఆప్షన్ సభ్యులు జమీల్, సర్పంచ్ సుధాకర్, జడ్పిటిసి బందిల వెంకటసుబ్బయ్య, గండవరం సూరి, బషీర్, బ్రహ్మదేవం వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

## మధురా నగర్ మిని రింగ్ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

– మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్



**ముత్తుకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో కాలేజీ విద్యార్థుల సౌకర్యంతో ప్రత్యేక రోడ్లు ఏర్పాటు కోసం మధురా నగర్ మత్స్యకారులతో గురువారం మండలాధ్యక్షులు మల్లికార్జున యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రింగ్ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తే గ్రామస్తులకు, విద్యార్థులకు బాగుంటుందని, ఈ విషయాన్ని పరిశీలించామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రింగ్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యగారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి బేషరత్తు గా క్షమాపణలు చెప్పాలి



**బిట్రగుంట ఆగస్టు 21 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పైన హత్యయత్నం కు పాల్పడానని నిరసిస్తూ మండల టిడిపి పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ నాగేశ్వరరావు విలేకర్ల సమా వేశం నిర్వహించారు. ఉదయ గిరి నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యే ఆస్తులపైన డ్రోన్ చిత్రీకరణలు చేయడం సబబు కాదని ఆయన ఖండించారు. వ్యక్తిగత ఆస్తులపై వీడియోలు చిత్రీకరించడం..అటు పైగా హత్యాయత్నానికి వ్యూహ రచన చేయడం ప్రజా వ్యతిరేక చర్యని వారు మండి పడ్డారు. తక్షణమే బేషరతుగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు, ఎమ్మెల్యే కు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కొద్దిపాటి కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేసారని దానిని ఓర్వలేక ఈ కుటిలమైన ప్రయత్నాలు చేస్తున్నారని ఇకపై చేస్తే నియోజకవర్గ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు నాగులవరం సొసైటీ అధ్యక్షులు చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, కాంద్ర రఘురాం నాయుడు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బోగోలు లో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం



**బిట్రగుంట ఆగస్టు 21 ప్రభాతవార్త:** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పై, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అనుచరులు హత్యాయత్నం చేయ డానికి రెక్కీ నిర్వహించటం ను నిరసిస్తూ బోగోలు బజారు సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం రాత్రి మాజీ శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దిష్టి బొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇది చాలా దారుణమైన విషయం అని,మారణాయుధాలతో రెక్కీ చేస్తూ పట్టుబడిన ఈ ఘటన ప్రతి ప్రజాస్వామ్యవాది ని దిగ్భ్రాంతికి గురి చేస్తుందన్నారు. ఇందుకు బాద్యులు అయిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల కన్వీనర్ ఎం. నాగేశ్వరావు, నాగులవరం సొసైటీ అధ్యక్షులు చిలకపాటి వెంకటేశ్వర్లు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్. సుదీర్ బాబు, బీజేపీ, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ పునర్నిర్మాణానికి బాలలయ కార్యక్రమం



**వింజమూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** వింజమూరు మండలం గుండె మదుగుల గ్రామంలో శిథిలావస్థకు చేరిన శ్రీ కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధ, గురువా రాలలో చేపట్టిన బాలలయ కార్యక్రమం పూర్తయిందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ ఆలయం పురాతనమైందని ప్రస్తుతం శిథిలావస్థకు చేరగా పునర్నిర్మాణానికి గ్రామస్తులు, కమిటీ చైర్మన్ అంకినపల్లె ఓబుల్‌రెడ్డి, ఆలయ ధ్మకర్త చీమల వెంకటరత్నారెడ్డి, స్థానికుల సభ్యులు సహకారంతో టీటీడీ సౌజన్యంతో శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.75లక్షల రూపాయలను మంజూరు చేయించి గ్రామస్తుల భాగస్వామ్యం 25 లక్షల రూపాయలతో మొత్తం కోటి రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణానికి రెండు రోజులుగా బలాలయ కార్యక్రమాన్ని జరిపించి పూర్తి చేశారు. వెంటనే ఆలయ నిర్మాణ పనులు చేపడతామని వారు తెలిపారు. గురువారం ఉదయాన్నే ఆలయంలో రుత్విక్‌ల సహకారంతో సంప్రోక్షణ గోమాత పూజ కలశ పూజ, హోమాది కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా ఓబుల్‌రెడ్డి కమిటీ సభ్యులు గాలి నరసపనాయుడు చైర్మన్ రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో 25 లక్షలు పోగుచేసి టిటీడీ అనుబంధమైన శ్రీవాణి ట్రస్టుకు డిపాజిట్ చేశామని అందుకు శ్రీవాణి ట్రసుటన వారు 75 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి కోటి రూపాయలు కూడా సరిపడవని మిగిలిన మొత్తాన్ని దాతలు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల ద్వారా సేకరించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో ఈ ఆలయ నిర్మాణం ఎలాంటి అవాంతరాలు ఎదుర్కోకుండా పూర్తికాగలరని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ నిధులు మంజూరు చేసేందుకు సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బూరాల శ్రీనివాసులు యాదవ్, దాట్ల విజయభాస్కర్‌రెడ్డి, సుంకం వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాజావలి, నల్లబోతుల హజరత్తయ్య, వారితో పాటు కుంకు కొండయ్య నాయుడు, అంకినపల్లి గోవిందరెడ్డి, ఏలేశం వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు, మహిళా భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు విద్యా ఉపకరణాలు వితరణ



**కావలి,ఆగస్ట్ 21, ప్రభాత వార్త:** కావలి పట్టణం నివాసులు వృత్తిరీత్యా నెల్లూరులో సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు. శ్రీనివాసులు నీరజ దంపతులు ఆస్ట్రేలియాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న వారి పెద్ద కుమారుడు ఒట్టూరు.అర్జున్ 33 వ జన్మదినం సందర్భంగా గురువారం సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు కల్లయ్య అధ్యక్షతన కావలి రూరల్ మండలం, ఒట్టూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నందు గల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ యొక్క పాఠశాల పిల్లలకు విద్యా సామాగ్రి అవసరమై ఉందని సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రకు తెలియజేశామని,ఈ విషయాన్ని సబ్ ఇన్స్పెక్టర్ ఒట్టూరు శ్రీనివాసులు నీరజ దంపతుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే వారి పెద్ద కుమారుడు ఒట్టూరు. అర్జున్ జన్మదినం సందర్భంగా మా పాఠశాల విద్యార్థులకు అవ సరమైన నోట్ బుక్స్ ని అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా దాతలకు ధన్య వాదాలు తెలియ జేస్తు న్నామని తెలిపారు. అలాగే ఈ రోజు పుట్టినరోజు జరుపుకుంటున్న ఒట్టూరు.అర్జున్ కి పుట్టినరోజు శుభాకా ంక్షలు తెలియ జేస్తు న్నామని తెలిపారు.ఈ కార్యక్రమం నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసి సహకరించిన తమ పాఠశాల పిటి ఉపాధ్యాయుడు కే నరసింహారావును అభినందిస్తున్నామని తెలిపారు.సంయుక్త సేవా సంస్థ ద్వారా ఆటో డ్రైవర్ సురేంద్ర చేస్తున్న సేవలను ప్రత్యేకంగా పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డి.శ్రీలలిత, సిహెచ్. శ్రీనివాసులు, కేనరసిం, జి.ఫ్రాంక్లెన్ ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నంసురేంద్ర,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## సీతారామపురంకి అడహాక్ తహసిల్దారుగా షేక్ ఫజిహా



**సీతారామపురం ఆగష్టు 21 ప్రభాతవార్త :** సీతారామపురం మండల అడహాక్ తహసిల్దారుగా షేక్.ఫజిహా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమే జిల్లా సివిల్ సప్లయ్స్ లో ఐఒసిఎల్ ,ఎల్‌పిజి అవుట్‌లేట్ స్పెషల్ డిప్యూటి తహసిల్దారుగా పనిచేస్తు అడహాక్ తహసిల్దారుగా బదలీపై సీతారామపురం మండలానికి వచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీతారామపురం మండలంలో నెలకొన్న రెవిన్యూ సమస్యలను పరిష్కరించి ప్రజలకు రైతులకు న్యాయం చేస్తానని అన్నారు. ప్రభుత్వ సూచనలు, ఆదేశాలకు అణుగుణంగా పనిచేస్తు ప్రతి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. ఇక్కడ తహసిల్దారుగా పనిచేస్తున్న పి.వి కృష్ణారెడ్డి సీతారామపురంలోని ఒ పొలంకి సంబందించి ముటేషన్ చేయడంలో అవకతవకలు జరిపారని కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి అవకతవకలు జరిగినట్లు నిర్ధారించడంతో తహసిల్దారు పి.వి కృష్ణారెడ్డిని బుధవారం కలెక్టర్ ఆనంద్ సస్పెండ్ చేశారు.

## వ్యవసాయాధికారులకు శిక్షణా కార్యక్రమం



**పొదలకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** పొదలకూరు మండలంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శివనాయక్ ఆధ్వర్యంలో పొదలకూరు, మనుబోలు, చేజర్ల, కలువాయి, రాపూరు మండలాల్లోని, గ్రామ వ్యవసాయ సహాయకులు, విస్తరణాధికారులకు, గ్రామ ఉద్యా నశాఖ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ క్రాప్ బుకింగ్, వ్యవసాయ పనిముట్లు సర్వే, ఇతర పథకాల గురించి, క్షేత్ర స్థాయిలో చీడపీడలు నివారణ తదితర విషయాలపై తెలిపారు. ఉద్యానశాఖ సహాయ సంచాలకులు అనురాధ మాట్లాడుతూ పామాయిల్ పంట సాగు గురించి, రైతులకు సబ్సీడీలో అందుబాటులో ఉందని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు పామాయిల్ సాగు చేసి 4 సంవత్సరాల నుంచి మంచి దిగుబడులు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఉద్యానశాఖ సంచాలకులు అనురాధ, ఉద్యానశాఖ అధికారులు ఆనంద్, మిథ్యాల, వ్యవసాయ అధికారులు ప్రతాప్, వెంకట కృష్ణయ్య, పి. సోమసుందర్, బి. జ్యోత్స్న, ఏఈఓలు, విఎఎలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

## గిరిజనులకు ఆర్థికసాయమందించిన డాక్టర్ ప్రణీత్



**ఆత్మకూరు,ఆగస్టు21,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కుటుంబ ఆవేదనను సోషల్ మీడియాద్వారా తెలుసు కున్న డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ ఎస్.వి.ప్రజావైద్యశాల ఎండి డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ సహృదయంతో స్పందించారు. తమ ట్రస్ట్ తరపున హైడ్రోసెఫాలిస్‌తో బాధపడుతున్న చిన్నారి పోలమ్మకు,వారి కుటుంబానికి తమ ట్రస్ట్ ద్వారా 10 వేల రూపాయల ఆర్థికసాయాన్ని గురువారం ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, శరవణ, రహీం తదితరుల ద్వారా అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ వింజం దొరసానమ్మ ట్రస్ట్ తరపున డాక్టర్ ప్రణీత్ ఎన్నో కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించారని, సోషల్ మీడియా ద్వారా దేవరకొండ శ్రీనివాసులు వీరి కుటుంబం గురించి తెలియజేయడంతో ఆయన స్పందించి ట్రస్ట్ తరపున సహకారం అందించారన్నారు. భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి ఏదైనా అవసరమొస్తే ఆదుకునేలా చర్యలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు , బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్ , ఫిట్టర్ కోర్సుల చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

**అనుమసముద్రంపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** ఏఎస్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ 2025-26 సంవత్సరానికి గాను ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లో 3వ విడత ఖాళీలను భర్తీ చేసేందుకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ షేక్ గౌస్‌బాషా తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 8వ తేదీ సాయంత్రం 5గంటల లోగా ఐటిఐ.ఎపి.జిఒవి.ఇన్ అను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు ఏఎస్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో కాని లేదా తమ సమీప ప్రభుత్వ ఐటిఐ కాలేజీల్లో కానీ ఆగస్టు 27లోగా తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో వెరిఫికేషన్ చేసుకోవాలని గౌస్‌బాషా తెలిపారు.అభ్యర్థులు ఏఎస్‌పేట పారిశ్రామిక శిక్షణా సంస్థలో చేరదలచుకున్న అభ్యర్థులు ఆగస్టు 29వ తేదీ తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్స్‌పాల్ గౌస్‌బాషా తెలిపారు. కావున అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సంచార జాతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

– 30న సంచార జాతులను ఏకం చేస్తూ విజయవాడలో బహిరంగ సభ



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 21, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సంచార అర్థ సంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని స్ఫూర్తి పేరుతో విజయవాడలోని ది వెన్యూ ఫంక్షన్ హాల్‌లో 30న నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎస్.వంశీధర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో సంచార జాతుల స్ఫూర్తి కరపత్రాలను ఆ పార్టీ నేతలతో కలిసి వంశీధర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హరిదాసులు, హరికథల కళాకారులు, గంగిరెద్దుల వాండ్లు, బుర్ర కథ కళాకారులు, వీదుల్లో గారడీ విద్య చేసేవారు, సర్కస్ కళాకారులు వీరంతా భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. వీరిని అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రనాళికలు సిద్ధం చేసిందని, అందులో భాగంగా విజయవాడలో సంచార జాతులను ఏకం చేస్తూ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లా నుంచి సంచార జాతి ప్రజలను, నాయకులను బహిరంగ సభకు ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిలో వీరి పాత్ర కూడా ఉందని వివరించారు. సంచార జాతుల అభివృద్ధి కోసం, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లాలోని గొలగమూడి, ఆత్మకూరు ప్రాంతాలలో నగరంలోని పడారుపల్లిలో సంచార జాతి ప్రజలు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరి నాయకులతో చర్చించి విజయవాలో జరిగే బహిరంగ సభలో పాల్గొనేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 30న ఉదయం 5గంటలకుబీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి తామంతా విజయవాడకు బయలుదేరుతామని తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాదవ్ నేతృత్వంలో సంచార జాతులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వీరి సంక్షేమం కోసం వారందరిని జనాభా లెక్కల్లో చేర్చి వారికి అవసరమైన గేహ నిర్మాణం, వారు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వెల్లడించారు. నెల్లూరు జిల్లా నుంచి విజయవాడలో జరిగే బహిరంగ సభకు సంచార జాతుల నేతలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వీరందరిని ఒక వేదిక మీదకు చేర్చి వారికి వృత్తిపరమైన నైపుణ్యం, ఇతర అభివృద్ధి పథకాలను అందించడం ద్వాఆర వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. వీరంతా ఈ నెల 30న విజయవాడలో జరిగే బహిరంగ సభకు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, రాష్ట్ర నాయకులు కోసూరు బాలయ్య గౌడ్, మారం కృష్ణ శివకుమార్ గౌడ్, ఐటీ విభాగం నాయకులు శివ, పార్టీ కార్యాలయ కార్యదర్శి కే.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## వరిగొండ దేవరాళ్లమిట్ట శ్రీ బ్రహ్మేశ్వర స్వామి భూముల వేలం పాటలు వాయిదా



**తోటపల్లిగూడూరు, ఆగష్టు 21, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలం వరిగొండ గ్రామంలోని దేవరాళ్ల మిట్ట శ్రీ బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం భూములకు సంబంధించి గురువారం నిర్వహించాల్సిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. వాయిదా వేయడానికి గల కారణాలను స్థానిక గ్రామస్తులు భక్తులు మీడియా దృష్టికి తెచ్చారు. ఈ ఆలయానికి సంబంధించిన భూములు 13 ఎకరాల 50 సెంట్లకు సంబంధించిన పాత బకాయిలు లెక్కలు తేల్చి పాటలు నిర్వహించాలని గ్రామస్తులు దేవస్థానం ధర్మకర్తగా చెప్పుకుంటున్న వారిని నిలదీయడంతో సదరు ధర్మకర్త నా దేవాలయం నా ఇష్టం అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో గ్రామస్తులు, భక్తులు లెక్కలు చెప్పి పాటలు నిర్వహిచాలని డిమాండ్ చేయడంతో వేలంపాటలు వాయిదా పడ్డాయి. 2019-20 సంవత్సరంలో సుమారు అన్ని ఖర్చులు కలిపి దాదాపు 4 లక్షల 75000 ఖర్చు పెట్టినట్లు లెక్కలు చూపడాన్ని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై దేవస్థానం ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా లెక్కలు సరి చూడాల్సి ఉందని గ్రామస్తుల అభ్యంతరాలు దృష్టిలో పెట్టుకుని వేలంపాటలు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయమై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఆలయ పరిస్థితి సరిదిద్ది నూతన కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నారు. ఈ మీడియా సమావేశంలో తాంద్ర నాగరాజు, కర్పూరం వెంకు రెడ్డి, తాంద్ర బాలాజీ, ఈగ రవి దీక్షితుల అమరేంద్ర భక్తులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ పథకం

– వృద్దుల ఆరోగ్యానికి మోదీ సర్కార్ అందించిన గొప్ప వరం



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 21, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రాంతంలోని 38వ డివిజన్ సోమశేఖరపురంలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద, 70 సంవత్సరాలు దాటిన వృద్దుల కోసం ఉచిత ఆరోగ్య కార్డ్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, మాజీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైదన సేవలు అందించాలనే సంకల్పంతో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. ఈ పథకంతో 70 సంవత్సరాలు దాటిన వృద్దులు ఆదాయంతో సంబంధం లేకుండా ఉచితంగా 5 లక్షల వరకు ఆరోగ్య కవరేజ్ పొందగలుగుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో, ప్రైవేటు ప్రభుత్వ రంగంలో పూర్తిగా ఉచితంగా చికిత్స పొందే అవకాశం కల్పించబడిందన్నారు. గతంలో పేద కుటుంబాలు చికిత్స చేయించుకోవడానికి భూములు అమ్ముకోవడం లేదా నగలు తాకట్టు పెట్టడం వంటి కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు మోదీ సర్కార్ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వలన వృద్దులకు ఇకపై ఆర్థిక భారమేమి లేకుండా వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 70 సంవత్సరాలు లోపు ఉన్నవారు ఈ పథకం ప్రయోజనం పొందాలంటే జన గణన సర్వేలో తప్పనిసరి నమోదై ఉండాలన్నారు. అలాగే ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది కూడా ఈ పథకం కింద ఉచిత ఆరోగ్య సేవలు పొందవచ్చు అని తెలిపారు. సీఎస్‌సీ సెంటర్స్, మీ సేవ కేంద్రాలు, లేదా మొబైల్ యాప్ ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, ముసునూరు సుబ్బారావు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు ఆపాల్గొన్నారు.

## ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ఉచిత విద్యకు గడువు పెంపు

– ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూళ్ళకు అదనపు గదుల కొరత – ఎంఈఓ తిరుపాలు వెల్లడి



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 21, ప్రభాతవార్త :** ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అల్పాదాయ వర్గాల పిల్లల కోసం ప్రవేశపెట్టిన ఉచిత విద్యా పథకంలో భాగంగా ఒకటో తరగతిలో చేరేందుకు ప్రభుత్వం గడువు పొడిగించిందని నెల్లూరు అర్బన్, రూరల్ ఎంఈఓ బి.తిరుపాలు వెల్లడించారు. నెల్లూరులోని ఎంఈఓ కార్యాలయంలో ఆయన గురువారం ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. 2009 యాక్ట్ ను అనుసరించి ఆర్‌టీఈ 12(1) సీ ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్యకు అవకాశం కల్పించబడిందని వివరించారు. ఇందుకు అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత ఆంగ్ల మాధ్యమాన్ని కోరుకునే వారి కోసం ఇది ఒక సదవకాశమని చెప్పారు. అలాగే 2025-26 విద్యా సంవత్సరంలో ఎక్కువ శాతం విద్యార్థులు ఉన్నత ప్రభుత్వ స్కూళ్లను మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చడం జరిగిందని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో రూరల్ ప్రాంతంలో 45 మోడల్ ప్రైమరీ స్కూళ్లు, అర్బన్‌లో 24 మోడల్ ప్రైమరీ స్కూళ్ళను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. 65 మంది కన్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఈ విధంగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ స్కూళ్లలో నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లో రాణించడం, లాంటిమెరిట్ విద్యకు అవకాశం ఉందన్నారు. ఇలాంటి పాఠశాలల్లో ఖచ్చితంగా ఐదు మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తారని వెల్లడించారు. అయితే ఈ స్కూళ్లలో అదనపు గదుల కొరత సమస్య వెంటాడుతోందని తెలిపారు. అదనపు గదుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు.

## పులివెందుల ఓటమి షాక్‌తో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుంది

**– పులివెందుల ప్రజలు రప్పా రప్పా అంటూ 40 ఏళ్ల వైఎస్ ప్రస్థానానికి సమాధి కట్టారు**
**– చట్టసభలకు వచ్చే ధైర్యం లేక చంద్రబాబు, పవన్, లోకేష్‌పై బురద జల్లుతున్నారు**
**– ఫేక్ ఫొటోలు, పాత సంఘటనలతో ప్రభుత్వంపై సాక్షి దుష్ప్రచారం చేస్తుంది**
**– తప్పు చేస్తే ఏ స్థాయి వాడైనా చంద్రబాబు ఉపేక్షించరు.. ఎవరిపైనైనా చర్యలు తప్పవు**
**– ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్**

నెల్లూరు, ఆగష్టు 21, ప్రభాతవార్త –వైద్యం : ఓటమి తట్టుకోలేక కూటమి ప్రభుత్వంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని, ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా నిజనిజాలు చెప్పకుండా ఫేక్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని వైసీపీ నేతలు, సాక్షి మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్ ధ్వజమెత్తారు. గురువారం మంగళగిరిలోనిటీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాలను, వైసీపీ నేతల విమర్శలను ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ

**ఓటమి తట్టుకోలేక ప్రభుత్వంపై విషం :**

గతవారం రోజులుగా వైసీపీ సోషల్ మీడియా, సాక్షి మీడియా,జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర నుంచి వైసీపీ నాయకులంతా ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు. పులివెందలలో జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి షాక్‌ను ప్రజల్లో పక్కదారి పట్టించేందుకు తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాక్షసులు రామాయణం రాసినట్టుగా వైసీపీ నేతలు వ్యవహారిస్తున్నారు. అవినీతి, అరాచకాలు, విధ్వంసాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనలో చిన్న తప్పులను కూడా సహించరు. క్రమశిక్షణకు మారుపేరు చంద్రబాబు. దేశవ్యాప్తంగా ఒక విజనరీ నాయకుడిగా ఆయనను గుర్తించారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి అప్పుల ఊబిలోకి నెట్టడమే కాక, ఆంధ్రప్రదేశ్‌ను భయానక పరిస్థితికి గురి చేశారు అని గుర్తు చేశారు.

**రాష్ట్రాభివృద్ధి చూసి ఓర్వలేక టీడీపీ దుర్మార్గాలు అంటూ ఫేక్ ప్రచారం:**

ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, మరో వైపు యువనేత నారా లోకేష్ ప్రపంచంలోని అనేక సంస్థలు, పెట్టుబడి దారులతో సమావేహై రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారు. కేంద్ర సంస్థలను కూడా రాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని వైసీపీ పూనుకుంది. రాష్ట్రంలో శాసనసభ్యులకు సంబంధించిన ఏదైనా చిన్న సమస్య వచ్చినా, దానిని పదేపదే సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలు, దుర్మార్గాలు అంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారు. గతంలో చీఫ్ సెక్రటరీ ఎల్వి సుబ్రమ్మణ్యం, ఎన్నికల కమీషనర్ రమేష్ కుమార్, మాజీ జడీజీ ఏబీ వెంకటేశ్వరరావు, ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ భాస్కర్ వంటి అధికారులపై వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా జులుం చేసింది, ఏ విధంగా బ్లాక్ మెయిల్ చేసి పరిపాలన సాగించింది అన్నది ప్రజలందరికి తెలిసిందే. అదే పార్టీ ఈ రోజు తెలుగుదేశం పరిపాలనపై దుష్ప్రచారం చేయడం ఆశ్చర్యకరం. వైసీపీ ప్రవర్తనలోని ఉదాహరణలు ప్రజల కళ్లముందే ఉన్నాయి.

**– చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేష్‌కి మంత్రి పదవి ఇచ్చారు.**
**– డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకు పాల్పడి శవాన్ని డోర్ డెలివరీ చేసిన అనంతబాబుకు చట్టసభలో సీఎం పక్కన స్థానం కల్పించారు.**
**– టీడీపీ కార్పొరేటర్ గాంధీ కన్ను పొడిచిన వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు.**
**– కృష్ణలంక పోలీసు స్టేషన్‌పై దాడి చేసిన నందిగం సురేష్నుఉ ఎంపీగా చేశారు.**
**– పేర్ని నాని, సిదిరి అప్పలరాజు మంత్రులుగా పోలీసులపై దూషణలు చేశారు**

ఇవన్నీ వైసీపీ పరిపాలనలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా కూలిపోయిందని నిరూపిస్తున్నాయి. ఇప్పుడు మాత్రం మేము దొంగలు కాబట్టి మీరు కూడా దొంగలు.. మేము అవినీతి పరులం కాబట్టి మీరు కూడా అవినీతి పరులు.. మేము విధ్వంసాలు చేశాం కాబట్టి మీరు కూడా చేస్తున్నారు అని ప్రజల ముందు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు అని దుయ్యబట్టారు.

**2024 ఎన్నికల్లో వైసీపీ చెంప చెల్లుమనిపించిన ప్రజలు:**

ఎక్కడా ఏ సమస్య జరగకపోయినా వర్షాలైనా, వరదలైనా, చిన్న ఘర్షణలైనా, వాటిని బూతద్దంలో చూపించి ప్రభుత్వంపై చెడ్డపేరు తేవడమే వైసీపీకి మిగిలిపోయిన రాజకీయ వ్యూహం. ప్రతిపక్షంగా అసెంబ్లీలో ప్రశ్నలు అడగడానికి ధైర్యం లేకపోయినా, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం సోషల్ మీడియా, సాక్షి మీడియా ద్వారా చంద్రబాబు, లోకేష్‌బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై బురద జల్లడమే చేస్తున్నారు. సాక్షి పత్రికలో వచ్చే ఫొటోలు, సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు అన్నీ కల్పితం. ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలను పాత ఫటోలను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. ఇదే పద్ధతిలో 2014-19 వరకు వివేకానంద రెడ్డి హత్య, కోడికత్తి కేసు, పింక్ డైమండ్, డీఎస్‌ప్ర ప్రమోషన్లు వంటి అబద్ధపు కథలతో ప్రచారం చేసి 2019లో లబ్ది పొందారు. కానీ 2024లో ప్రజలు నిజం గుర్తించారు. అందుకే వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయి అని ఎద్దేవ చేశారు.

**కూటమి ప్రభుత్వంలో ఎవ్వరు తప్పు చేసినా చర్యలు తప్పవు:**

2024లో ప్రజలు చెంప చెల్లుమనిపించినా పెట్టుబడులపైనా, ప్రభుత్వ పథకాలపైనా, వరదలపైనా, అమరావతి మునకపైనా, కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఎక్కడ చిన్న తప్పు జరిగినా చంద్రబాబు దానిని ఉపేక్షించడం లేదు. ఇది వైసీపీ ప్రభుత్వం కాదు.. ఇక్కడ హత్యలు చేస్తే ప్రమోషన్ లేదు, విధ్వంసాలు చేస్తే ఇల్లు లోపల సీటు లేదు. ఎవరైనా తప్పు చేస్తే తప్పనిసరిగా చర్యలు ఉంటాయి. ఈ ప్రభుత్వం సుపరిపాలనతో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తోంది అని తెలిపారు.

**తిరుమల పవిత్రను భష్టు పట్టించిన భూమన:**

పవిత్రమైన తిరుమలపైనా వైసీపీదుష్ప్రచారం ఆగడం లేదు. గత ప్రభుత్వంలో టీటీడీలో బోర్డు నియామకాలు, టెండర్లు కనుగోళ్లలో జరిగిన అవినీతిని ప్రజలు మరచిపోలేదు. కానీ ఈ రోజు చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తిరుమల పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి చేస్తోంది. తప్పుడు ఆరోపణలపై దావా వేయడానికి వెనుకాడబోమని టీటీడీ చైర్మన్ కూడా స్పష్టం చేశారు అని అన్నారు.

**పులివెందుల ప్రజలు రప్పా రప్పా అంటూ 40 ఏళ్ల వైఎస్ ప్రస్థానానికి సమాధి కట్టారు:**

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమతుల్యం చేస్తోంది. ఉచిత బస్సులు, పెన్షన్ల పెంపు, స్త్రీ శక్తి పథకాలు, పెట్టుబడుల వెల్లువ, ఐటీ టూరిజం, ఇండస్ట్రీ రంగాల్లో కొత్త అవకాశాలు. అమరావతి, విజయవాడ, తిరుపతిని టెక్నాలజీ హబ్‌లుగా మార్చే దిశగా ముందుకు వెళ్తోంది. వైసీపీ నాయకులు పులి వెందులలో ఓటమి తర్వాత భయాందోళనలో పడ్డారు. రప్పా రప్పా తలలు తెగనరుకుతాం అన్న వారినే పులి వెందుల ప్రజలు ఓట్లతో గట్టిగా బోధించారు. 40 ఏళ్ల కోటను బద్దలు కొట్టి ప్రజలు జగన్ అహంకారానికి చెక్ పుట్టారు. ఇది ప్రజల తీర్పు అని దుయ్యబట్టారు.

## గణేష్ మండపాలకు అనుమతులు సులభతరం



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** గణేష్ మండపాలకు సంబంధించి నిర్వాహకులకు అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానం అమలు అందుబాటులోకి తీసుకువచ్చి సులభ తరం చేసిందని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండపం ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు వారి కమిటీ సభ్యుల వివరాలు, ప్రవేశం, ఏ పోలీస్స్టేషన్ పరిధిలోని వస్తుంది. అనే వివరాలతో పాటు విగ్రహం , మండపం ఎత్తు, విగ్రహాన్ని ఏ రోజు ప్రతిష్టిస్తారు.. ఏ రోజు నిమజ్జనం చేస్తారు.. ఏ వాహనంలో తరలిస్తారు అనే వివరాలను వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంలో తప్పనిసరిగా నిర్వాహకుల ఫోన్ నెంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో మద్యం తాగి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. విగ్రహాలు ఏర్పాటు సమయంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. డీజేలకు , అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు. మండపాల దగ్గర ఎక్కువ శబ్దం వచ్చే లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాత్రి వేళల్లో తప్పనిసరిగా మండపం వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు.. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా శాంతి యుతంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతవాతావరణంలో ఈ వేడుకలు నిర్వహించేలా గణేష్ విగ్రహ నిర్వాహకులు తగు సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంగనాథ్ గౌడ్ ఉన్నారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు రేపు ధృవపత్రాల పరిశీలన :జిల్లా యస్.పి. కృష్ణకాంత్



**నెల్లూరు క్రైమ్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** గత డిసెంబర్, జనవరి నెలల్లో జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండులో జరిగిన కానిస్టేబుళ్ళ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరై, సివిల్, ఎపిఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులకు ఈనెల 23వ తేదీ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సర్టిఫికెట్స్ పరిశీలన జరుగుతుందని ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు. ఉదయం 9.00 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని అయన స్పష్టంచేశారు. ఎంపికైన అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో అప్లికేషనుతో జతపర్చిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషను చేయించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, ఇటీవల తీయించిన ఆరు పాస్పోర్టు సైజ్ కలర్ ఫోటోలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. హాజరైన అభ్యర్థి అటెస్టేషను ఫారం నందు పూర్తి వివరాలు పొందుపరిచిన తర్వాత గెజిటెడ్ అధికారితో ధృవీకరణ చేయంచడం తప్పనసరి అని స్పష్టంచేశారు.

## మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు



**నెల్లూరు రూరల్, ఆగస్టు 21, ప్రభాత వార్త** రాజకీయ వర్గాల్లో చురుకుదనం నెలకొల్పిన సంఘటనగా గురు వారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన నేతలు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సమావేశం నెల్లూరు డైకస్ రోడ్‌లోని ఆయన నివాసంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వేంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు. పార్టీ భవిష్యత్ వ్యూహాలు, జిల్లా స్థాయి బలోపేతం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. అలాగే, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై కూడా వారు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ భేటీ అనంతరం అక్కడి పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. మేకపాటి రాజమోహన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడి సలహాలు, మార్గదర్శకతతో జిల్లా రాజకీయాల్లో కొత్త ఉత్సాహం ఏర్పడుతుందని స్థానిక రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## చినశేషవ వాహనంపై వెంకయ్య స్వామి దర్శనం



**వెంకటాచలం,ఆగష్టు 21, ప్రభాతవార్త:** ఆరాధన ఉత్సవా లు భాగంగా గురువారం అత్యంత వైభవంగా నిర్వ హిం చారు. వేకువ జాము నుంచి స్వామివారికి అభిషేకము, సుప్రభాత సేవ గోపూజ నిర్వహించారు. ఆలయాన్ని సుం దరంగా విద్యుత్ దీపాలతో అలంకరించి పూలతో తీర్చిది ద్దారు. మంగళ వాయిద్యాలు మేళ తాళాలు నడుమ స్వామి వారిని అత్యంత వైభవంగా హనుమంత సేవ పై ఆశీనులు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ముందు మ హిళలు కోలాటాలు నిర్వహించి, ఓంనారాయణ, ఆదినారా యణ అంటూ భక్తులు ముందుకు సాగారు. చినశేషవ వాహన సేవకు సిహెచ్. శ్రీధర్(నెల్లూరు),వై. నరసింహ రావు (సొత్ రాజు పాలెం),సిహెచ్. శ్రీధర్(నెల్లూరు) ,వై. నం సింహ రావు(సొత్ రాజు పాలెం),యెన్ .సుబ్బరాజు(కుల్లూరు రాజు పాలెం),దిలీప్ కుమార్ రెడ్డి(నెల్లూరు) యెన్ .సుబ్బరాజు(కుల్లూరు రాజు పాలెం),దిలీప్ కుమార్ రెడ్డి(నెల్లూరు) ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు అన్న దానం శ్రీ చల్ల వెంకట గోపి కృష్ణ ,దీపిక(ఆమంచర్ల) నిర్వహించారు

**రాత్రి వైభవంగా గజ వాహన సేవ** రాత్రి నిర్వహించనున్న గజ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి హంస వాహన సేవ పై ఆసీనులు చేసి గ్రామంలో విహరించారు. దారి పొడుగునా మహిళలు స్వామి వారికి కర్పూర నీరాజనం సమర్పించారు. ఉదయము రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు వి వి ఎస్ వినోద్ అన్నమాచార్య భక్తి కీర్తనలు ఏర్పాటు చేసారు

**ఆరాధన ఉత్సవాల్లో** అశ్వ వాహన సేవ ఉదయం 10 గంటలకు శ్రీ గుదే శ్రీధర్ ,అరుణమ్మ ఎస్ వి ఎస్ అల్లాయ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ,నెల్లూరు ఉభయకర్తలుగా రాత్రి నిర్వహించనున్న పెద శేష వాహన సేవకు శ్రీ ఈదురు రామ మోహన్ రెడ్డి ,సుప్రియ ఈదురు రామ్ ప్రదీప్ రెడ్డి ,లక్ష్మి శర్వాణి ఉభయ కర్తలగా వ్యవహరించునున్నారు

## మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి దిష్టిబొమ్మ ను దగ్ధం చేసిన టిడిపి నాయకులు



**కావలి,21 ఆగస్టు ప్రభాతవార్త:** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మీద జలదంకి మండలం అన్నవరం క్వారీలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరులు చేసిన హత్యకాండకు నిరసనగా గురువారంకావలి పెద్దపవని రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి వార్డు ఇంచార్జ్ మంచాల ప్రసాద్, మాజీ జిల్లా కార్యదర్శి దామా మాల్యాద్రిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది అక్కడ నుండి జనతా పేట కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాపరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగినది ఈ సందర్భంగా మంచాల ప్రసాద్ దామా మాల్యాద్రి నాయుడులు మాట్లాడారు కావలి నియోజకవర్గం లో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఓర్వలేక తన అనుచరులతో కావలి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి పై హత్యాయత్నానికి పాల్పడడం జరిగిందని సంబంధిత నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు వార్డు టిడిపి నాయకులు తలపనేని ప్రభాకర్, అధ్యక్షులు దశరదయ్య, వెంగయ్య, భాస్కర్, శోభన్, సుధాకర్, మహిళా నాయకురాలు పద్మావతి, వార్డు సభ్యులు, కె ఎస్ ఎస్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయడం జరిగింది

## శోభాయమానంగా పల్లకి సేవ



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వా మి దేవస్థానంలో స్వామివారి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆల యాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభ వంగా అలంకరించారు. ప్రాత:కాలము నే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చ కులు పరాంకుశం రాఘవాచార్యులు, రుత్వికులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యం లో రుద్రాభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వేణుంబాక రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్తలు దండి సురేష్ దంపతులు, కుటుంబ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ రెడ్డిని అరెస్ట్ చేయాలి



**కావలి,21 ఆగస్టు ప్రభాత వార్త:** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పై హత్యాయత్నానికి ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని కావలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కల్లగుంట మధుబాబు నాయుడు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 26, 29 వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసి సం యుక్తంగా జనతా పేటలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కండ్లగుంట మధుబాబు నాయుడు మాట్లాడుతూ కావలి అభివృద్ధి ఫలాలు అందించి అవినీతి లేకుండా పాలన చేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పై హత్యాయత్నానికి ఉసికొల్పడం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డికి తగదన్నారు. నెల్లూరు నుంచి ప్రైవేట్ వ్యక్తులు తీసుకువచ్చి డ్రోన్ కెమెరా ఎగరవేసి హత్య చేసేందుకు తన సొంత మనుషులను అన్నవరం లోని క్వారీ కి పంపించడం ఎంతవరకు సమంజసమన్నారు. కావలిలో హత్య రాజకీయాలు కొత్తగా నేర్పిస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల కాలంలో తుమ్మలపెంట పరిధిలో పైలాన్ శిలాఫలకాలను ధ్వంసం చేసి తెలుగుదేశం పార్టీ పై నెట్టేందుకు కుయుక్తులు పన్నీ విఫలం కావడంతో ఏమి చేసినా ఎమ్మెల్యే దగుమాటి అడ్డు వస్తున్నాడని ఒకేసారి హత్య చేస్తే తనకు అడ్డు ఉండదని భావించినట్లు ఉందన్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. అరెస్టులు చేయకపోతే నిరసన దీక్షలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు మాట్లాడుతూ కావలిలో హత్య రాజకీయాలు ఎప్పుడు లేవని కొత్త పందాలు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తీసుకొచ్చారన్నారు. ఇటువంటి చర్యలు చేపడితే వైసీపీకి తీవ్ర గుణపాఠం చెప్తామన్నారు,26 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎమ్మెల్యే పై దాడి చేసేందుకు ప్రయత్నించిన ఘటనలు ఏమీ లేవని, కొత్త పందాలు సృష్టించి అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డిని అంతమొందించేందుకు ప్రతాప్ రెడ్డి కుట్రలు చేయడం దారుణం అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం ఉన్నప్పుడు ఏ నాయకుడిపై అక్రమ కేసులు బనాయించలేదని,ఇబ్బంది పెట్టిన సందర్భాలు కూడా లేవని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు 29వ వార్డు మాజీ కౌన్సిలర్ సురే మదన్ మోహన్ రెడ్డి,బొట్లగుంట హరిబాబు, డాకా శ్రీనివాసుల రెడ్డి, వల్లూరి మహేష్ నాయుడు, పెనుమల్లి అశోక్, సాయి, చెన్నకేశవులు, కౌశిక్, బాలకృష్ణ, పవన్, మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు చేపడితే ఫలితాలు మీ వెంటే



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** ఉద్యానవన పంటల సాగుపై కూడా రైతులు దృష్టి సారించేలా గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కోవూరు వ్యవసాయ శాఖసబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన గ్రామ వ్యవసాయ సహాయకులు ఉద్యానవన శాఖ సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పనిచేయాలనే తపన ఉంటేనే ఆ శాఖ అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌లో కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ముందంజలో ఉందని, ఇందుకు ఏడీఏ, ఏవోలకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నూతనంగా అగ్రిస్టార్ట్ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని, దీనిని గ్రామ వ్యవసాయ సహాయకులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారదర్శకంగా యాప్‌లో నమోదు చేస్తే రైతుకు వ్యవసాయానికి సంబంధించి ఏయే పనిముట్లు అవసరమవుతాయో తెలుసుకు నేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఆరుతడి పంటలపై కూడా రైతులు దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం జిల్లాకు 1400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్స్ చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని, దీనిపై కూడా రైతులకు అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ పొలాల గట్లు, తదితర ప్రాంతాల్లో ఉద్యానవన పంటలు మరింత సాగు చేసేలా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రస్తుతం ఈ ఆయిల్ ఫామ్స్ సాగు చేపట్టిన రైతులు నాలుగు సంవత్సరాలు నిరీక్షిస్తే అనంతరం వారికి లాభాల బాటలో పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎకరాకు 57 మొక్కలు అవసరమవుతాయని, ఇవి కూడా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అవసరమైతే ఇందులో వరి పంట కూడా సాగు చేసుకునే అవసరం ఉందన్నారు. ఈ ఆయిల్ ఫామ్ టన్ను 18600 గా ఉందని, ఆ ధరకు కంపెనీలు తప్పక కొనాలన్నారు. అంతర్ పంటల సాగుకు అవసరమైతే ప్రభుత్వం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ కూడా అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో 50 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్స్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా కోకోనట్ సాగుపై కూడా రైతులు దృష్టి పెడితే అవి కూడా వారిని లాభాల బాటలో పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, ఉద్యానవన శాఖ అధికారి ప్రసన్న, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు టి. రజని, ఎస్. విజయలక్ష్మి, ఎన్. శ్రీహరి, వి. శశిధర్, పి. మేరీ కమల, సీహెచ్ఎస్ లక్ష్మి, ఐదు మండలాలకు సంబంధించిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన శాఖ సహాయకులు ఉన్నారు.

## అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

**- మానవహారం చేపట్టిన అంగన్‌వాడీలు**



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** కోవూరులోని సాయిబాబా గుడి సమీపంలో గురువారం సాయంత్రం కోవూరు మండలానికి సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై. సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీలు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని జీతాలు పెంచాలన్నారు. అదేవిధంగా కొత్తగా యాప్‌లో నమోదు చేసుకునేందుకు వెంటనే ట్యాబ్‌లు అందజేయాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీలకు సంబంధించి ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేస్తున్న పనిభారానికి తగ్గట్టుగా జీతాలు లేవని , తప్పక పెంచాలనిఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు.అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



**కోవూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరు ప్రాంతానికి చెందిన కె. శశి కుమార్(45) కుటుంబ సమస్యలతో గురువారం పొలాల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం కొత్తూరు ప్రాంతానికి చెందిన శశి కుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో తట్టుకోలేక గురువారం మద్యంలో విషం కలుపుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పొలాల్లో ఉన్న రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్ కానిస్టేబుల్ రషీద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు. మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

## బుచ్చిలో అంగన్‌వాడీల మానవహారం



**బుచ్చి ఆగష్టు 21 ప్రభాతవార్త** అంగన్‌వాడీలకు పనిభారం పెంచడం మంచి పద్ధతి కాదని సిఐటియు మండల నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, జిల్లానాయకురాలు ఎల్‌వి శేషమ్మ హితవు పలికారు. గురు వారం బుచ్చిరెడ్డిపాళెం మండలకేంద్రంలోని పార్కు కూడలి వద్ద అంగన్‌వాడీలతో కలిసి నిరసన తెలిపారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంగన్‌వాడీలకు 2 జి మొబైల్స్‌ను ఇచ్చి యాప్‌లో అప్లోడ్ చేయమంటే వీలు పడడం లేదని వాటిని ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసిన ఇంకా యాప్‌లో డేటాను అప్‌లోడ్ చేయమంటు వేధించడం సరికాదని అన్నారు. 5జి మొబైల్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.రాత్రి పూట బడులు చెప్పమంటు ఎంపిడిఒలు వేదిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు.10000 జీతం ఇస్తున్నారని ఆ జీతం వల్ల బరిగేది ఏమిలేదని జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అంగన్‌వాడీలకు అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు ఎల్ వి శేషమ్మ, షేక్ జానీబాషా, అంగన్‌వాడీ నాయకులు కవిత, సుమ,అనిత, స్వర్ణ, సుప్రజా, అనూషా,శివపార్వతీ, రమణమ్మ, కామేశ్వరీ, సుజాత, అమర్‌సేన, తదతరులు పాల్గొన్నారు.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో పుట్టా దంపతులు ప్రత్యేక పూజలు





**బుచ్చి ఆగష్టు 21 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలో మాజీచైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నా యుడు,పుట్టా లక్ష్మీకాంతమ్మ అమ్మవారికి నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు గురువారం తన పెళ్ళి రోజు అని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తే ఎంతో సంతృప్తిగా ఉంటుందని వారు పేర్కొన్నారు. జీవితంలో శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయిని నమ్ముకున్న వారికి అంతా మంచే జరుగుతుందని అన్నారు. అనంతరం బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పుట్టా ప్రదీప్ ,హరిష్ తదితరులు పాల్గోన్నారు.

## వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్



**సంగం ఆగష్టు 21 ప్రభాతవార్త** వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని సంగం సిఐ వేమారెడ్డి,,ఎస్ఐ రాజేష్ తెలిపారు. వినాయకుడు విగ్రహం పెట్టే వారు మొదటగా కమీటిగా ఏర్పాటు కావాలని అన్నారు. మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్న తరువాత సంబందిత పోలీస్ అధికారి మండల స్ధలాన్ని తనీఖీ చేసి నిబంధనల ప్రకారం ఉండే క్యూఆర్ స్కానర్ కోడ్‌తో కూడిన నిరంతర పత్రాన్ని (ఎన్‌ఒసి ) జారీ చేస్తారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలందరు వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఆందోత్సహాలతో జరుపుకోవాలని చెప్పారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు పాలుపడినా కేసులు నమోదు చేస్తామన్నారు. డీజేలకు, లౌడ్ స్పీకర్ల,అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని చెప్పారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని అన్నారు.

## జెండాదిబ్బ రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బి అధికారులకు మంత్రి సిఫారస్ లేఖ



**సంగం ఆగష్టు 21 ప్రభాతవార్త** సంగం మండలం జెండాదిబ్బ గ్రామానికి బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారి నుండి హరిజనవాడ అవతల వరకు రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిఫారస్ లేక ఇవ్వడం జరిగింది.జెండాదిబ్బ టిడిపి నాయకులు పర్వతాల వెంకటరత్నం ఆలేఖను ఆర్అండ్‌భి అధికారులకు అందజేశారు.రెండు,మూడు రోజులలో అంచనాలు తయారు చేసి ఇస్తామని ఆర్అండ్ భి అధికారులు చెప్పినట్లు వెంకటరత్నం తెలిపారు. గత వారం రోజుల క్రితం దండు బాటకు కూడా స్పెషల్ పంచాయితీ రాజ్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనాలు పంపించారని వెంకటరత్నం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## కుళాయిల మరమ్మత్తులు చేపట్టి నీటి వృధాను అరికట్టండి : ఎస్.ఈ రామ్ మోహన్ రావు



**నెల్లూరుకార్పొరేషన్,ఆగష్టు 21,ప్రభాత వార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో సరైన నిర్వహణలో లేని వీధి తాగు నీటి కుళాయిలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, నగరవ వ్యాప్తంగా నీటి వృధాను అరికట్టాలని ఇంజ నీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గిడ్డంగి వీధి, కంసాలి వీధి, కుక్కల గుంట, మునిసిపల్ వెహికల్ షెడ్డు పరిసర ప్రాంతాలలో గురువారం ఉదయం పర్యటించారు. వివిధ ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్వచ్ఛత నాణ్యతను ఎస్.ఈ ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్.ఈ మాట్లాడుతూ కుళాయిలకు మూతలు లేకుండా, డ్యామేజ్ అయి, పగిలిపోయి ఉన్న కండిషన్ లో ఉన్న వాటిని గుర్తించి వెంటనే రిపేర్లు చేపట్టాలని, అవసరమైనచోట్ల నూతన ట్యాప్ లను బిగించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాలలోని డ్రైను కాలువలలో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వ్యర్థాలను గుర్తించి తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పనిసరి బుచ్చి సిఐ శ్రీనివాసులురెడ్డి,ఎస్ఐ సంతోష్‌రెడ్డి



**బుచ్చి ఆగష్టు 21 ప్రభాతవార్త** వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని బుచ్చి సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. వినాయకుడు విగ్రహం పెట్టే వారు మొదటగా కమీటిగా ఏర్పాటు కావాలని అన్నారు. మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్న తరువాత సంబందిత పోలీస్ అధికారి మండల స్ధలాన్ని తనీఖీ చేసి నిబంధనల ప్రకారం ఉండే క్యూఆర్ స్కానర్ కోడ్‌తో కూడిన నిరంతర పత్రాన్ని (ఎన్‌ఒసి ) జారీ చేస్తారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలందరు వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఆందోత్సహాలతో జరుపుకోవాలని చెప్పారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు పాలుపడినా కేసులు నమోదు చేస్తామన్నారు. డీజేలకు, లౌడ్ స్పీకర్ల,అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని చెప్పారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని అన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలకు నిలయం



**వలేటివారిపాలెంఆగష్టు 21ప్రభాతవార్త,** పోకూరు ఆదిఆంధ్రకాలనీలోని డిపెప్ పాఠశాల బడివేళల అనంతరం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.గ్రామనడిబొడ్డున గల ఈ పాఠశాలకు రెండు భవనాలు ఉన్నాయి.రోడ్డుపక్కనే గల ఈ భవనాలకు ప్రహరిగోడ లేదు.పక్కనే కాలనీలు ఉన్నాయి.దీంతో ఈ ప్రాంగణం మందుబాబులకు,ఆకతాయిలకు నిలయంగా మారింది.ఉదయం పాఠశాల ప్రారంభసమయాన ఉపాధ్యాయులకు విద్యార్దులకు మద్యం బాటిల్స్ మందు గ్లాసులు దర్శనం ఇస్తాయి.పవిత్రమైన సరస్వతీ నిలయంలో మద్యం సేవించడం,మలమూత్రాలు విసర్జించడంతోపాటు పలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నప్పటికిని,విద్యాశాఖాదికారులుగానీ,పంచాయతీ సచివాలయ సిబ్బందిగానీ పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తొంది. చిన్నారుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాలకు ప్రహరిగోడ నిర్మించాల్సిందిగా పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.